సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.16,500
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16,500, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.17
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.17, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 1,650 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
35.3°/21.1°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రత్యేక విమానంలో వచ్చిన పవన్



డిప్యూటీ సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్: అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ హిట్' సభలో పాల్గొనేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఆర్.జే రత్నాకర్, ఆర్డీఓ సువర్ణ, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తి విమానాశ్రయంనుంచి 1.42 గంటలకు ప్రత్యేక హెలీకాప్టర్‌లో అనంతపురానికి బయలుదేరి వెళ్లారు. సభ ముగిసిన తర్వాత అనంతపురం నుంచి హెలీకాప్టర్‌లో పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుని ఇక్కడ నుంచి ప్రత్యేక విమానంలో 5.30 గంటలకు తిరిగి హైదరాబాదుకు వెళ్లారు.

'అన్నదాత పోరు'తో ప్రభుత్వాన్ని మేల్కొలిపాం

- కార్యక్రమం విజయవంతం చేసిన వారందరికీ ధన్యవాదాలు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



పెనుకొండ రూరల్: రైతు కష్టాలను పట్టించుకోకుండా నిద్రపోతున్న కూటమి సర్కారును 'అన్నదాత పోరు'తో మేల్కొలిపామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. యూరియా కోసం రైతు పడుతున్న కష్టాలను పాలకులకు తెలియజెప్పేందుకు మంగళవారం జిల్లాలో నిర్వహించిన 'అన్నదాత పోరు' విజయవంతమైందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ విభాగాల నాయకులు, రైతులు, రైతు క్షేమం కోరే వారంతా స్వచ్ఛందంగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. వారందరికీ పేరుపేరున కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ప్రజా సమస్యలపై పోరాటానికి వైఎస్సార్ సీపీ ఎప్పుడూ ముందుంటుందన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత జక్కల ఆదిశేషు మృతి



జక్కల ఆదిశేషు (ఫైల్)

తనకల్లు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, నల్లమాడ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జక్కల ఆదిశేషు (44) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవలే ఓడీ చెరువులోని తన బావ బొడ్డు నాగరాజుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఉంటూ చికిత్స పొందుతున్నారు. బుధవారం పరిస్థితి విషమించడంతో అక్కడే తుది శ్వాస విడిచారు. జక్కల ఆదిశేషు వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి కదిరి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. అడిగిన వారికి లేదనకుండా సాయం చేసే వ్యక్తిగా ఆయనకు ప్రజల్లో మంచి పేరుంది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తన సొంత డబ్బుతో బోర్లు వేయించారు. జక్కల ఆదిశేషు 2014–19 మధ్యకాలంలో నల్లమాడ జెడ్పీటీసీగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య జక్కల జ్యోతి తనకల్లు మండల జెడ్పీటీసీగా ఉన్నారు. జక్కల ఆదిశేషు మృతి గురించి తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు విషాదంలో మునిగిపోయారు. జక్కల ఆదిశేషు అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామమైన తనకల్లు మండలం బొంతలపల్లిలో నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

జక్కల ఆదిశేషు మృతి బాధాకరం..

నల్లమాడ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, నల్లమాడ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జక్కల ఆదిశేషు ఆకస్మిక మృతి బాధాకరమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, మండల మాజీ కన్వీనర్ పారకల రామాంజనేయులు అన్నారు. ఆదిశేషు మృతి గురించి తెలియగానే వారు ఓడీ చెరువుకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అలాగే వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి పారకల రమణ, పార్టీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణ రెడ్డి, తనకల్లు మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో ఆదిశేషు మృతికి సంతాపం తెలిపారు.

వద్దు బాబోయ్!

విసుగెత్తించిన సూపర్ సిక్స్ సభ



సీఎం చంద్రబాబు మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న మహిళలు



బాబు మాట్లాడుతున్న సమయంలో జనం లేక బోసిపోయిన గ్యాలరీలు

- చంద్రబాబు ప్రసంగం ప్రారంభించిన కొద్దిసేపటికే జనం తిరుగుముఖం
- టీడీపీ కేడర్, పోలీసులు ఎంత ఆపినా ఆగని వైనం
- ప్రసంగం సగం కూడా పూర్తి కాకనే గ్యాలరీలు ఖాళీ
- సభా ప్రాంగణం వద్ద తగిన ఏర్పాట్లు లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు
- మండుటెండలో ఉక్కపోతతో అల్లాడిపోయిన మహిళలు

అనంతపురం: 'సూపర్ సిక్స్–సూపర్ హిట్' పేరుతో బుధవారం అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగం ప్రారంభించిన కొద్దిసేపటికే జనం ఇళ్ల బాట పట్టారు. ముఖ్యమంత్రి ప్రసంగం సగం కూడా పూర్తి కాకనే గ్యాలరీలన్నీ ఖాళీ అయ్యాయి. జనాన్ని ఆపేందుకు టీడీపీ కేడర్, పోలీసులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

అడిగి మరీ చప్పట్లు !

సీఎం చంద్రబాబు ప్రసంగం కూడా ఆద్యంతం 'ఆత్మస్తుతి–పరనింద' చందాన సాగింది. తాము చేసిన కార్యక్రమాల గురించి గొప్పలు చెబుతూనే చప్పట్లు కొట్టాలని సీఎం పదేపదే జనాన్ని కోరడంతో వచ్చిన వారు విసుగెత్తిపోయారు. సీఎం కోరినా చప్పట్లు కొట్టడానికి ఆసక్తి చూపించకపోవడంతో 'ఏమయ్యా నేను ఉచితంగా గ్యాస్ ఇచ్చాను. అది వినియోగిస్తున్నారు కదా కనీసం చప్పట్లు అయినా కొట్టండి' అంటూ బతిమాలుకోవడం గమనార్హం. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో జనసేన నాయకులు జెండాలను ఎగురవేయడంతో వాటిని



అభివాదం చేస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం

కిందికి దించాలని సీఎం పదేపదే కోరారు. అయినా జనసేన కార్యకర్తలు పోటాపోటీగా జెండాలను ప్రదర్శించడం కనిపించింది. దీనిపై టీడీపీ శ్రేణుల నుంచి అసంతృప్తి వ్యక్తమైంది. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన ప్రసంగాన్ని ఐదు నిమిషాల్లోపే ముగించడంపై పలువురు చలోక్తులు విసిరారు. 'సూపర్ సిక్స్' పూర్తి స్థాయిలో అమలు చేయకనే సూపర్ హిట్ కార్యక్రమం ఏర్పాటు చేయడంపై ఆయనకు ఇష్టం లేదేమో! అంటూ పలువురు చర్చించుకున్నారు.

నానా అవస్థలు..

సభా ప్రాంగణం వద్ద జనం నానా అవస్థలు పడ్డారు. మండుటెండలో ఉక్కపోతతో అల్లాడిపోయారు. పలువురు వేడి తట్టుకోలేక వాంతులు చేసుకున్నారు. కేవలం కొన్ని గ్యాలరీల్లోనే కుర్చీలు వేసి, చాలా చోట్ల వేయకపోవడంతో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిల్చోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఎందుకు ఇక్కడికి వచ్చాం దేవుడా అంటూ నిట్టూర్చారు.

పోలీసు ఆంక్షలతో కష్టాలు ..

సూపర్ సిక్స్ సభ సందర్భంగా జిల్లాలో పోలీసులు విధించిన ట్రాఫిక్ ఆంక్షలతో ప్రయాణికులకు చుక్కలు కనిపించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించడం గమనార్హం. ఏకంగా అనంతపురం నగరానికి 5 కిలోమీటర్ల దూరం నుంచే బస్సులను, వాహనాలను దారి మళ్లించడంతో ప్రయాణికులకు దిక్కుతోచని స్థితి నెలకొంది. అనంతపురం నుంచి బెంగళూరుకు వెళ్లాల్సిన రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. హైదరాబాద్–బెంగళూరు మార్గంలో వాహనాలను వడియంపేట– బుక్కరాయసముద్రం–నాయనపల్లి క్రాస్– నార్పల– ధర్మవరం–ఎస్‌ఎస్ గేట్ మీదుగా మళ్లించడంతో తీవ్ర ఇక్కట్లు పడాల్సి వచ్చింది. మధ్యలో నార్పల–బత్తలపల్లి మార్గం సరిగా లేకపోవడంతో ప్రయాణంలో నరకం కనిపించింది. సాధారణంగా అనంతపురం నుంచి పెనుకొండ వద్ద ఉన్న కియా కంపెనీకి ఉద్యోగులు 50 కిలోమీటర్లు ప్రయాణిస్తే సరిపోయేది. కానీ బుధవారం అదనంగా మరో 40 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చింది.

యంత్రాంగానికీ ఇక్కట్లు..

సభ పూర్తిగా పార్టీ కార్యక్రమమే అయినా అధికార యంత్రాంగాన్ని భాగస్వాములను చేశారు. దాదాపు 10 జిల్లాల నుంచి పోలీసులను కేటాయించారు. ఈ క్రమంలో ఖాకీలు కూడా ఇబ్బందులు పడ్డారు. బందోబస్తు చర్యలను పర్యవేక్షించాల్సింది పోయి జనం సభ నుంచి వెళ్లిపోకుండా కాపలా కాయాల్సి వచ్చింది.

సచివాలయాల మూత



అనంతపురంలో 31వ వార్డు సచివాలయానికి తాళం వేసిన దృశ్యం



బస్సులో మహిళా సంఘాల సభ్యులను తరలిస్తున్న సచివాలయ సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: కూటమి పార్టీల కార్యక్రమం నేపథ్యంలో సచివాలయాలు మూతపడ్డాయి. పైగా ఈ కార్యక్రమానికి తరలించేందుకు సచివాలయ సిబ్బందితోనే జన సమీకరణ చేయించడం గమనార్హం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఆర్టీసీ, ప్రైవేట్, స్కూల్ బస్సుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లారు. మహిళా సంఘాల సభ్యులు వచ్చారో లేదో నమోదు చేసుకున్నారు. సమావేశానికి రాని వారికి ఫోన్లు చేసి పిలిపించారు. అనంతరం తమ పరిధిలో ఎంత మందిని బస్సుల్లో ఎక్కించారో ఆ వివరాలను ఆయా గ్రూపుల్లో నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. అనంతపురంలో అయితే ఎంత మంది బస్సుల్లో ఉన్నారు.. పూర్తి స్థాయిలో వచ్చారా.. తదితర వివరాలు ఆరా తీసేందుకు అధికారులు సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం. ఉద్యోగులను పార్టీల కార్యక్రమాలకు వాడుకోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

బెదిరింపులు.. ప్రలోభాలు

సభకు జనాన్ని తరలించాలని 10 రోజుల క్రితమే 'పచ్చ' పార్టీ నేతలు నిర్దేశించారు. ఈ క్రమంలో జనాన్ని తెచ్చేందుకు ఉద్యోగులు బెదిరింపులకు దిగారు. సభకు రాకుంటే సంక్షేమ పథకాలు నిలిపివేస్తామంటూ డ్వాక్రా మహిళలకు యానిమేటర్లు హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో అనంతపురం రూరల్‌లో ఓ యానిమేటర్ డ్వాక్రా సంఘం లీడర్‌కు చేసిన బెదిరింపుల ఆడియో, కంబదూరు మండలం అచ్చంపల్లిలో టీడీపీ నేతలు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ చాటింపు చేసిన ఘటనలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బలవంతపు తరలింపుపై అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో డ్వాక్రా సంఘాల లీడర్లు తిరగబడడం చర్చనీయాంశమైంది. తాము వచ్చేది లేదని, కావాలంటే తమ సంఘాల్ని గ్రామ సంఘం నుంచి తీసేసుకోండి అని తెగేసి చెప్పడం గమనార్హం.

మద్యం మత్తులో జోగిన తమ్ముళ్లు..



రాప్తాడులో వైన్ షాపు దగ్గర మద్యం కొనుగోలు చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

సూపర్ సిక్స్ సభ సందర్భంగా 'తమ్ముళ్లు' మద్యం మత్తులో మునిగితేలారు. పల్లెల నుంచి అనంతపురం నగరానికి వచ్చే మార్గాల్లోని ధాబాల వద్ద బస్సులను ఆపి మద్యం సేవించే ఏర్పాట్లు చేశారు. దీంతో తమ్ముళ్లు 'పండుగ' చేసుకున్నారు. మద్యం తాగి చిందేశారు. మద్యం మత్తులో పలువురు సీఎం సభకు రాకుండా బస్సుల్లోనే సేదతీరారు.



పోలీసులను ఐషర్ వాహనంలో కుక్కి తరలిస్తున్న దృశ్యం



నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి పోలీసు ఆంక్షల కారణంగా బోసిపోయిందిలా..



అనంతపురం నగరంలో పోలీసు ఆంక్షలతో వాహనదారుల ఇక్కట్లు



సభలో ఎండవేడిమికి ఇబ్బందులు పడుతున్న మహిళలు



సూపర్ సిక్స్ సభ నేపథ్యంలో మూతపడిన అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల కళాశాల

పేదల వైద్యం.. ప్రైవేటు పరం

పెనుకొండ మెడికల్ కళాశాలపై కూటమి సర్కార్ విషం చిమ్మింది. కళాశాల అందుబాటులోకి వస్తే కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతుందనుకున్న నిరుపేదల ఆశలపై నీళ్లు పోసింది. నిర్వహణ భారమంటూ మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేసేందుకు నిర్ణయించింది. కూటమి 'కుట్ర'పై ప్రజలతో పాటు ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి.



జగన్ హయాంలో చేపట్టిన మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు



ల్యాబ్, ఇతర అవసరాల నిమిత్తం చేపట్టిన పనులు

- పెనుకొండ మెడికల్ కళాశాలపై కాల 'కూటమి' విషం
- పీపీపీ పేరుతో ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం
- కరువు ప్రజలకు కార్పొరేట్ ఉచిత వైద్యం ఇక కలే
- ఎకరా రూ.2 కోట్ల విలువైన భూమిని ఏడాదికి రూ.100తో లీజు
- ప్రైవేటుకు ధారాదత్తంతో ప్రజల అయోమయం



పెనుకొండ: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడం..వైద్య విద్యనభ్యసించే విద్యార్థులకు మరిన్ని మెడికల్ సీట్లు అందుబాటులోకి తెచ్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గానికి ఒకటి చొప్పున నూతన మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలోనే 2021 అక్టోబర్ 31న అప్పటి సీఎం వైఎస్ జగన్ వర్చువల్ పద్ధతిలో పెనుకొండ మెడికల్ కళాశాలకు కూడా శంకుస్థాపన చేశారు. దీంతో ఈ ప్రాంత వాసులంతా ఎంతో సంతోషించారు. మెడికల్ కళాశాల, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు కావడంపై హర్షించారు. పెనుకొండకు ప్రత్యేక గుర్తింపుతో పాటు పేదలకు మేలు జరుగుతుందని సంబరపడ్డారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పీపీపీ పేరుతో ప్రైవేటు పరం చేస్తుండడంపై ఆవేదనకు గురవుతున్నారు.

వడివడిగా పనులు..

పెనుకొండ మెడికల్ కళాశాలకు వైఎస్సార్ సీపీ హయాంలో రూ. 475 కోట్లు మంజూరయ్యాయి. మెడికల్ కళాశాలతో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నర్సింగ్ ఆస్పత్రి నిర్మాణానికి గత ప్రభుత్వమే శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అప్పటి ఎమ్మెల్యే శంకరనారాయణ అధికారులను పరుగులు పెట్టించి



పనులు పర్యవేక్షిస్తున్న అప్పటి మంత్రి ఉషశ్రీచరణ్ (ఫైల్)

పనులు వేగవంతం చేశారు. కానీ కళాశాల ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో బండరాళ్లు ఉండటంతో వాటిని బ్లాస్టింగ్ చేస్తూ పనులు చేపట్టారు. ఈ క్రమంలో పనులు కాస్త ఆలస్యమయ్యాయి. అయినప్పటికీ అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని భవనాలకు పిల్లర్లను నిర్మించడమే కాక కొన్ని భవనాలకు పైకప్పు పనులు సైతం పూర్తి చేశారు. అప్పటి ఎమ్మెల్యే శంకరనారాయణ, ఉమ్మడి జిల్లా మంత్రిగా ఉన్న ఉషశ్రీచరణ్, కలెక్టర్, ఇతర అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి పనులు ముందుకు సాగేలా చూశారు.

కూటమి రాకతో ఆశలు ఆవిరి..

కూటమి ప్రభుత్వం వచ్చాక పెనుకొండ మెడికల్ కళాశాల పనులు నిలిచిపోయాయి. పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థను ఇక్కడి నుంచి పాలకులు సాగనంపారు. ఇక కొత్త కాంట్రాక్ట్ సంస్థకు ఇస్తారని ప్రజలు భావించినా... అందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు అప్పగిస్తూ కేబినెట్‌లో తీర్మానించడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఉచిత వైద్యం అందుతుందనుకుంటే ముక్కు పిండి వసూలు చేసే ప్రైవేటు విధానం అమల్లోకి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా రూ.వందల కోట్ల విలువైన వైద్య కళాశాల భూమిని ఎకరా ఏడాదికి కేవలం రూ.100తో లీజుకు ఇవ్వడంపై మండిపడుతున్నారు. కూటమి సర్కార్ చర్యల వల్ల ఈప్రాంత ప్రజలకు ఉచిత వైద్యం అందకపోగా, ఈ ప్రాంత యువత వైద్యవిద్యకూ అడ్డంకులు ఎదురవుతాయంటున్నారు. ఇప్పటికైనా కూటమి సర్కార్ తన నిర్ణయాన్ని విరమించుకుని పెనుకొండ కళాశాలను పూర్తి చేసి ఈప్రాంత పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందేలా చూడాలని కోరుతున్నారు.

వైద్యం 'ప్రైవేటు'కు తగదు



పెనుకొండ ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటుకు అప్పగించడాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం. ఎన్ని నిబంధనలు విధించినా ప్రైవేటు సంస్థ లాభాపేక్ష లేకుండా కళాశాలను నిర్వహించలేదు. దీంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షగా మారుతుంది. ప్రభుత్వ లక్ష్యం పూర్తిగా నీరుగారుతుంది.

– హరి, సీపీఎం జిల్లా నాయకులు, పెనుకొండ

ప్రభుత్వం పునరాలోచించాలి



మెడికల్ కళాశాలను ప్రైవేటుకు అప్పగించే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం పునరాలోచించాలి. మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయడం వల్ల పేదలకు ఉచిత వైద్యం అందని ద్రాక్షగా మారుతుంది. పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుంది. పైగా రూ.కోట్ల విలువైన స్థలాన్ని ఎకరా సంవత్సరానికి రూ. 100కు లీజుకు ఇవ్వడం బాధాకరం.

– రఘునాథరెడ్డి, కౌన్సిలర్, పెనుకొండ

పేదల ఆశలపై నీళ్లు పోశారు



పేద, మధ్య తరగతి ప్రజలంతా వైద్యానికి ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం పెనుకొండలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తుందని తెలిసి అందరూ సంబరపడ్డారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుకోవచ్చనుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు పోసింది.

– వెంకటరాముడు, మునిమడుగు, పెనుకొండ

క్లుప్తంగా

గుడిసె దగ్ధం



మంటలు ఆర్పుతున్న గ్రామస్తులు

ముదిగుబ్బ: మండలంలోని దొరిగిల్లులో బుధవారం సాయంత్రం చోటు చేసుకున్న ప్రమాదంలో లక్ష్మమ్మ గుడిసె దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పేలోపు వంట సరుకులు, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధితురాలు కన్నీటి పర్యంతమైంది.

నాయకుల ముందస్తు అరెస్ట్

- మడకశిర పోలీసుస్టేషన్‌లో ఆనంద రంగారెడ్డి, దళిత నేత హనుమంతు అక్రమ నిర్బంధం



ఆనందరంగారెడ్డి, హనుమంతును పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

మడకశిర: కూటమి సర్కార్ అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ సిక్స్–సూపర్ హిట్' సభ నేపథ్యంలో బుధవారం మడకశిర పోలీసులు నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతును పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీసుస్టేషన్‌లో ఉంచారు. ఈ సందర్భంగా ఆనందరంగారెడ్డి మాట్లాడుతూ...ముందస్తు అరెస్టులతో ప్రజల తరఫున వినిపించే తమ గొంతును నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. 'సూపర్ సిక్స్' పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండానే 'సూపర్ హిట్' పేరుతో కూటమి ప్రభుత్వం సభను నిర్వహించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతు మాట్లాడుతూ, ముందస్తు అరెస్ట్‌లతో దళిత ఉద్యమాలను ఆపలేరన్నారు. 'మలుపు' పథకంతో పాటు లెదర్ పార్కులను ప్రారంభించి చర్మ కారులు, దళిత నిరుద్యోగ యువతను ఆదుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తున్న తనను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఉంచడం అన్యాయమన్నారు. ఇది దళితులపై కూటమి ప్రభుత్వం సాధిస్తున్న కక్షగా భావిస్తున్నామన్నారు.

విషజ్వరాల విజృంభణ

వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లాలో విషజ్వరాలు విజృంభించాయి. ఏ ఇంటికెళ్లినా ఒకరిద్దరు జ్వరంతో మంచాన పడి ఉండడం కనిపిస్తోంది. పిల్లల్లో ముఖ్యంగా విష జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. వారం రోజులకుపైగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి.





హిందూపురంలోని మాతాశిశు ఆస్పత్రిలో ఓపీ కోసం బారులు తీరిన దృశ్యం

- జిల్లాలోని ఆస్పత్రులన్నీ కిటకిట
- అపరిశుభ్రత కారణంగా విస్తరిస్తున్న మలేరియా, డెంగీ, టైఫాయిడ్

పెనుకొండ రూరల్/హిందూపురం టౌన్: విష జ్వరాలు వ్యాప్తి చెందడంతో హిందూపురంలోని జిల్లాస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. జిల్లాస్పత్రిలో సాధారణ సమయాల్లో 800 నుంచి వెయ్యి వరకు ఓపీ నమోదు అవుతుండగా గత వారం రోజులుగా వెయ్యి నుంచి 1,200కు దాటింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రోగుల రద్దీతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది. ఓపీ ముగిసిన తర్వాత ఎమర్జెన్సీ విభాగానికి రోగులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఆస్పత్రిలో సాధారణ రోజుటోల 60 నుంచి 80 మంది ఐపీలో ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య 120కు పైగా చేరుకుంది.

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదైన ఓపీ వివరాలు

మే	:	3,76,934
జూన్	:	4,16,619
జూలై	:	4,59,666
ఆగస్టు	:	2,15,200 (ఇప్పటి వరకు)

పేరుకుపోతున్న మురుగు

ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని పలు గ్రామాల్లో మురుగు పేరుకు పోయి దోమలు వృద్ధి చెందాయి. దోమకాటుతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇదే అదునుగా భావించిన పలు ప్రైవేట్ క్లినిక్‌ల నిర్వాహకులు అక్రమార్జనకు తెరలేపారు. రెఫరల్ వైద్యంతో ఆర్‌ఎంపీలు జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు సకాలంలో విధులకు హాజరు కాకపోవడంతో రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయించాల్సి వస్తున్నట్లుగా తెలుస్తోంది. నాలుగు నెలల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 13 డెంగీ కేసులు నమోదు కావడం కలవరం రేపుతోంది.



పెనుకొండ మండలం తిమ్మాపురంలో జనావాసాల నడుమ పేరుకుపోయిన మురుగు

కిక్కిరిస్తున్న చిన్నపిల్లల వార్డులు



జిల్లాలో విషజ్వరాల ప్రభావం చిన్నారులపై తీవ్రంగా చూపుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జ్వరపీడితులైన చిన్నారులే అధిక సంఖ్యలో కనిపిస్తున్నారు. హిందూపురంలోని జిల్లాస్పత్రిలోనూ చిన్నపిల్లల ఓపీ 250 వరకు నమోదవుతోంది. 90 నుంచి 100 మంది వరకు చిన్నారులు ఆస్పత్రిలో అడ్మిషన్‌లో ఉన్నారు.



హిందూపురం జిల్లాస్పత్రిలో కిక్కిరిసిన చిన్నపిల్లల వార్డు

అప్రమత్తంగా ఉన్నాం



సీజనల్ వ్యాధులు, విషజ్వరాలపై అప్రమత్తంగా ఉన్నాం. క్షేత్రస్థాయి సర్వేలతో పాటు సకాలంలో నాణ్యమైన వైద్యం అందజేస్తున్నాం. అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాం. – డాక్టర్ ఫైరోజాబేగం, డీఎంహెచ్‌ఓ

జలుబు.. దగ్గు.. జ్వరం...



ధర్మవరం ఆస్పత్రిలో విష జ్వరాల బాధితులు

ధర్మవరం అర్బన్: నియోజకవర్గంలోని ధర్మవరం పట్టణం, రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల వ్యాప్తంగా విషజ్వరాలు విజృంభించాయి. ఇప్పటి వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అధికారికంగా 2,596 కేసులు రికార్డయ్యాయి. ఇంకా ప్రైవేటు ఆస్పత్రుల్లో వేల సంఖ్యలో విషజ్వరాలు, దగ్గు, జలుబు, న్యుమోనియా కేసులు ఉన్నట్లు సమాచారం. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోజూ వందల సంఖ్యలో విషజ్వరాల బాధితులు వచ్చి చికిత్స చేయించుకుంటున్నారు.

ఎక్కడ చూసినా చెత్తాచెదారమే...

ధర్మవరం నియోజకవర్గ వ్యాప్తంగా పారిశుధ్య చర్యలు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించాల్సిన మున్సిపల్, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. ముఖ్యంగా ధర్మవరం పట్టణంలోని ప్రధాన రహదారులపై చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుధ్యం పడకేయడంతో వైరల్ జ్వరాలు పెరిగిపోతున్నాయి.

పట్టించుకునేవారు లేరు



కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యారు. ఏ వార్డులో చూసినా చెత్తాచెదారమే దర్శనమిస్తోంది. వార్డుల్లో పదిరోజులైనా చెత్తాచెదారం తొలగించడం లేదు. దోమలు విపరీతంగా పెరిగి విషజ్వరాలు వ్యాపింపజేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చొరవ చూపి పారిశుధ్య చర్యలు చేప.. వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలి.
– మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్, ధర్మవరం

ఎంపీ ఫ్లెక్సీ చింపివేత



ఎంపీ బీకే పార్థసారథి ఫ్లెక్సీని చించేసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: సూపర్ సిక్స్ సభ నేపథ్యంలో సోమందేపల్లిలోని వైఎస్సార్ సర్కిల్‌లో ఎంపీ బీకే పార్థసారథి వర్గీయులు బుధవారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని మంత్రి సవిత వర్గీయులు సాయంత్రం చించివేశారు. ఫ్లెక్సీలో మంత్రి సవిత ఫొటో లేకపోవడమే కారణంగా తెలుస్తోంది. ఈ ఘటనతో సవిత, బీకే మధ్య వర్గపోరు మరోసారి బహిర్గతమైంది. ఈ అంశాన్ని ఎంపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

ఎండుతున్న చెరువులు



కనుచూపు మేర వందల ఎకరాల్లో కనిపించని పంటల సాగు



ఏక కాలంలో ఇద్దరు రైతులు పక్కపక్కనే బోర్లు వేయిస్తున్న దృశ్యం

- అడుగంటిన భూగర్భజలాలు
- నిట్టనిలువునా వాడిపోతున్న పంటలు

ఓడీచెరువు: వర్షాభావం ఓడీచెరువు మండలాన్ని అతలాకుతలం చేస్తోంది. మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు నీరు లేక వట్టిపోయాయి. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు ఎండిపోయాయి. మండల వ్యాప్తంగా ఉన్న 24 చెరువులు, మరో 24 కుంటల పరిధిలో 1,300 ఎకరాల ఆయకట్టు ఉంది.

రైతుల పరిస్థితి దయనీయం

మండల వ్యాప్తంగా 4,200 వ్యవసాయ విద్యుత్ కనెక్షనుల ఉండగా దాదాపు 9వేల ఎకరాలు బోరుబావుల కింద సాగవుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరు బావులు ఎండిపోయాయి. నీరు అందక పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దీంతో రైతులు కొత్తగా బోరుబావులు తవ్వించడం మొదలు పెట్టారు. అదృష్టవశాత్తు నీళ్లు పడితే సరి... లేదంటే మరొకటి, అదీ పడకపోతే మరొకటి ఇలా ఒక్కో రైతు ఏడేనిమిది బోర్లు వేసిన దాఖలాలూ ఉన్నాయి. గతంలో 400 నుంచి 500 అడుగుల లోతు వరకూ బోరు వేస్తే నీరు సమృద్ధిగా లభ్యమయ్యేది. ప్రస్తుతం 800 అడుగుల నుంచి వెయ్యి అడుగులు వరకూ లోతుకు బోరు వేసినా నీటి జాడ కనిపించడం లేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

ఈ ప్రాంత రైతుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకునిసీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా 193 చెరువులను హంద్రీ–నీవా జలాలతో నింపే పనులకు ఆమోదం తెలుపుతూ రూ.864 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ పనులను పూర్తి చేయడంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది.

దిక్కు తోచడం లేదు



నాకున్న ఆరు ఎకరాల్లో పంటల సాగుకు బోరు బావి వేశాను. అరకొరగా నీరు లభ్యం కావడంతో మూడు ఎకరాల్లో టమాట సాగు చేపట్టాను. ఇప్పుడేమో చెరువుల్లో నీరు లేక బోరుబావి ఎండిపోయింది. టమాట సాగుకు చాలా పెట్టుబడి పెట్టాను. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.
– బయపరెడ్డి, రైతు, మామిళ్లకుంట్లపల్లి

అప్పు ఎలా తీర్చాలి



నాకున్న నాలుగు ఎకరాల్లో పంటల సాగుకని వరుసగా నాలుగు బోర్లు వేశాను. ఒక్క బోరులో కూడా చుక్కనీరు పడలేదు. అన్ని బోర్లు 700 నుంచి 900 అడుగుల వరకూ వేశాను. దాదాపు రూ. 7 లక్షలకు పైగా ఖర్చయింది. గతంలో బెంగళూరుకు వలసవెళ్లి కూడబెట్టిన డబ్బు పోను రూ.4 లక్షలు అప్పు చేయాల్సి వచ్చింది. ఈ అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.
– చింతా కృష్ణారెడ్డి, రైతు, మారెవాండ్లపల్లి

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో చోటు

సాక్షి, పుట్టపర్తి: వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల్లో జిల్లా వాసులకు చోటు దక్కింది. బూత్ కమిటీ వింగ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా హిందూపురానికి చెందిన టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ధర్మవరానికి చెందిన దేవరకొండ రమేష్ నియమించారు. ఈ మేరకు వెఎస్సార్‌సీపీ అధినేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వ్యక్తి బలవన్మరణం

పరిగి: మండలంలోని శీగిపల్లికి చెందిన రంగనాథ్ (40) ఆత్మహత్య చేసుకున్నాడు. కర్ణాటకలోని మధుగిరి ప్రాంతానికి చెందిన రంగనాథ్‌కు వివాహమైంది. రెండేళ్లుగా భార్య, పిల్లలకు దూరంగా ఉంటున్న ఆయన కొన్ని నెలల క్రితం శీగిపల్లికి చేరుకుని తన పెద్దమ్మ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి పక్కింట్లో నిద్రించడానికి వెళ్లిన రంగనాథ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం గుర్తించిన చుట్టుపక్కల వారి సమాచారం మేరకు పోలీసులు అక్కడు చేరుకుని పరిశీలించి, కేసునమోదు చేశారు.

నేపాల్‌లో చిక్కుకున్న వారి భద్రతకు చర్యలు

ప్రశాంతి నిలయం: నేపాల్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అక్కడ నివసిస్తున్న, పర్యటన నిమిత్తం వెళ్లి చిక్కుకుపోయిన జిల్లా వాసుల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన వారు ఎవరైనా నేపాల్‌లో చిక్కుకున్నట్లయితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08555289039 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. వారిని ఇక్కడికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

రోజంతా క్యూలో ఉన్నా ఒక్క బస్తానే!



యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

- యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు

పుట్టపర్తి అర్బన్: రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. అరకొర సరఫరా చేసి కావాల్సినంత నిల్వ ఉందంటూ అధికారులు, కూటమి నేతలు ప్రచారం చేస్తుండగా.. ఈ విషయం తెలియని రైతులు యూరియా కోసం బారులు తీరుతున్నారు. బుధవారం పుట్టపర్తి మండలం పెడపల్లి రైతు సేవ కేంద్రానికి 260 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు ఉదయం నుంచే ఆర్‌ఎస్‌కే ఎదుట బారులు తీరారు. రోజంతా నిలబడినా ఒక్కో రైతుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇచ్చారు. పైగా ఆధార్, పట్టాదార్ పాసుబుక్, వేలిముద్ర అంటూ హడావుడి చేశారు. దీంతో ఈ మాత్రం దానికి ఇంత కష్ట పెట్టాలా అంటూ రైతులు పెదవి విరిచారు.

అలరించిన మన్యం భక్తులు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న పార్వతీపురం మన్యం భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా నుంచి విచ్చేసిన సత్యసాయి భక్తులు బుధవారం సాయికుల్వంత్ సభామందిరంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అంతకు ముందు సామూహిక సత్యసాయి వ్రతాలు, సత్యసాయి అష్టోత్తర నామాలు, సత్యసాయి శతనామావళి జపించారు. సాయంత్రం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. అనంతరం మహాసమాధిని దర్శించుకున్నారు.